సర్వే వేగవంతం చేయాలి

నాగర్‌కర్నూల్: సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే, వరిధాన్యం, పత్తి కొనుగోళ్లపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని సివిల్ సప్లై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలలో అవసరమైనన్ని టార్పాలిను, ప్యాడి క్లీనర్స్ ,డిజిటల్ మెకో మీటరు, తదితర అవసరాలపై చర్చించారు. కుటుంబ సర్వే ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అడిగారు. సర్వే సమగ్ర వివరాల డాటా ఎంట్రీని ఆపరేటర్లతో డాటా ఎంట్రీ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే పూర్తి వివరాలపై డీపీఓ నివేదికను కోరారు. సర్వే పూర్తిచేసిన ఫారాల భద్రత స్టోరేజ్ పై ఎంపీడీఓ, కమిషనర్‌లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కే సీతారామారావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: ఇంటింటి సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు లేకుండా క్షుణంగా పరిశీలించి నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమగ్ర సర్వేలో సేకరించిన వివరాల కంప్యూటర్‌లో ఆన్‌లైన్ నమోదు పక్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో వారి వెంట ఎంపీఓ వెంకటేష్, ఏపీఎం బాలచందర్ తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను తహసీల్దార్ మోహన్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.


పెద్దకార్పాములలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ మోహన్

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి, కంప్యూటర్ అపరేటర్లకు సర్వే వివరాలు ఆన్‌లైన్ నమోదుపై ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. మండలంలో మొత్తం 60 మందితో ఆన్‌లైన్ నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. వెల్దండ మండల పరిషత్ కార్యాలయం, వెల్దండ ఎమ్మార్సీ కార్యాలయం, కల్వకుర్తిలోవెఎంఆర్ కళాశాల, కృష్ణవేణి కళాశాలల్లో ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీఓ లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, ఏపీఓ ఈశ్వర్‌జీ, హేమంత్‌రెడ్డి, బుచ్చి రాములు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మద్యం చోరీ చేస్తున్నారని ధర్నా

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని మద్యం డిపో సమీపంలో ఆగి ఉన్న లారీల నుంచి మద్యం కాటన్లు తరుచుగా దొంగతనం జరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని లారీ డ్రైవర్లు ధర్నా చేశారు. తమ సమస్య పరిష్కరించే వరకు మద్యం అన్‌లోడ్ చేసేందుకు లారీలు పెట్టమని డ్రైవర్లు అధికారులకు తేల్చిచెప్పారు. వివిధ కంపెనీలకు చెందిన లిక్కరు, బీరు లోడ్ చేసుకొని ప్రతిరోజు లారీలు తిమ్మాజిపేటలోని మద్యం గోదాంకు తీసుకువస్తాయి. మద్యం డిపో ఎదుట ఉన్న పార్కింగ్ స్థలంలో లారీలను పెట్టుకుంటారు. అయితే తరుచుగా లారీల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు మద్యం కాటన్లు చోరీ చేస్తున్నారు. దీంతో చోరీకి గురైన మద్యం డబ్బులు తమ మీద వేస్తున్నారని డ్రైవర్లు డిపో డీఎం దృష్టికి తెచ్చారు. చివరికి డీఎం సైతం తమపైనే నిందలు వేయడంతో ఆగ్రహంతో బయటకు వచ్చిన డ్రైవర్లు ధర్నా చేపట్టారు. దీంతో ఎక్సైజ్ సీఐ కల్యాణ్, ఎస్ఐ బాలీశ్వరి అక్కడికి చేరుకుని నచ్చజెప్పినా లారీడ్రైవర్లు వినిపించుకోలేదు. తిమ్మాజిపేట ఎస్ఐ నరేందర్‌రెడ్డి వచ్చి లారీలకు భద్రత కల్పించేలా పెట్రోలింగ్ చేస్తామని హామీ ఇవ్వడంతో లారీ డ్రైవర్లు ఆందోళన విరమించారు.


తిమ్మాజిపేటలో ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలి

వెల్దండ: విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని ఏడీఏ శంకరయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతికి అర్హులైన వారందరు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా రైతులు వ్యవసాయ బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. మండలంలో 6200 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, వీటికి సంబంధించి రూ.కోటి బిల్లులు, గృహాలకు సంబంధించి రూ.22 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సబ్‌ఇంజనీయర్ వెంకటేష్, అంకిత, లైన్‌ఇన్‌స్పెక్టర్ లస్కర్, లైన్‌మెన్‌లు లక్ష్మణ్, యాదయ్య, తిరుపతయ్యగౌడు, జేఎల్‌ఎంలు రామకృష్ణ, బంగారి, సాంబశివుడు, కృష్ణారెడ్డి, గిరి, గోపాల్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ శంకరయ్య

జిల్లా అధ్యక్షుడిగా జే. శ్రీనివాస్ రెడ్డి



కందనూలు: తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయల సంఘం నాగర్ కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కో–ఆపరేటివ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జె. శ్రీనివాస్ రెడ్డి 4వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మార్చాలా జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సీహెచ్ వెంకటరమణ, కోశాధికారిగా వట్టెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం తిరుపతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా భాస్కర్ రెడ్డి, జి కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు చంద్ర ప్రకాష్, సర్దార్, గిరిధర్, తుకారాములు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, చంద్రుడు, బాలు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ మూర్తి, బాలకిషన్, లత, రఘునందన్, భాస్కరరావు, జిల్లాలోని 80 పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్పీ జన్మదిన వేడుకలు



సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. కొల్లాపూర్‌లో ఆ పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. పెంట్లవెల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కల్వకుర్తి మండలంలోని తర్నికల్, వెల్దండలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: అదానీ ముడుపుల వ్యవహారంపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈడీ), సీబీఐ, సెబీ, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ లాంటి సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, కేశవులు గౌడ్, వార్లవెంకటయ్య, చంద్రమౌలి, ఏసయ్య, బొల్లెద్దుల శ్రీను, కృష్ణాజీ, లక్ష్మీపతి, శంకర్‌గౌడ్, అంజి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



తెలకపల్లి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో శనివారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ఆ పార్టీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రాచారి, జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి, కృష్ణయ్య, చిన్నారెడ్డి, అనీల్‌రావు, గోపస్ చందు, రాజు, ఆంజనేయులు, రవి, వెంకటాచారి, పరశురాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన ఏపీఓ

కోడేరు: మండలంలోని మాచుపల్లిలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపడుతున్న నర్సరీని ఏపీఓ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం మొక్కలకు మట్టి, ఎరువు కవర్లలో నింపాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు

బిజినేపల్లి: పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కురవి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య 43 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

తిరుపతికి సూపర్ లగ్జరీ బస్సులు

కొల్లాపూర్: కొల్లాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే డీలక్స్ బస్సుల స్థానంలో సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం ఉమాశంకర్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం పుష్‌బ్యాక్ సీట్లు కలిగిన సూపర్ లగ్జరీ బస్సులను శనివారం నుంచి ప్రారంభించినట్లు వెల్లడించారు. రోజు సాయంత్రం 7 గంటలకు కొల్లాపూర్ నుంచి బస్సు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు తిరుపతి నుంచి తిరుగుపయనం అవుతుందన్నారు. అదేవిధంగా కొల్లాపూర్ నుంచి జగద్గిరిగుట్టకు డీలక్స్ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. రోజు మధ్యాహ్నం 3 గంటలకు కొల్లాపూర్ నుంచి బస్సు బయల్దేరుతుందని తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

బల్మూర్: రైతులు, గృహ వినియోదారుల లోఓల్టేజి సమస్యను దృషిలో ఉంచుకొని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని గట్టుతుమ్మెన్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. కొన్నేళ్ల నుంచి విద్యుత్ లోఓల్టేజీ సమస్య కారణంగా ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో దీనికి ఎమ్మెల్యే స్పందించి సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అనుమతులు మంజూరు చేయించారు. దీంతో రైతులు, గృహవినియోగాదారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ

కల్వకుర్తి రూరల్: జిల్లా గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోగా, మండలంలోని మార్చాల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వెంకటరమణను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.

శనేశ్వరాలయానికి భక్తుల తాకిడి



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తుల తాకిడి పెరిగి కిటకిటలాడింది. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు జైష్ఠ్యాదేవి సమేత శనేశ్వరునికి తిలతైలాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకుడు శాంతికుమార్, ఉమామహేశ్వర్, సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి ఏపీఓ జిల్లాకు సరెండర్

పెద్దకొత్తపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఏపీఓ మంజుల పనితీరు సరిగ్గా లేకపోవడంతో జిల్లా అసిస్టెంట్ డీఆర్‌డీఓ శనివారం ఆమెను సరెండర్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు.

బాధిత రైతును ఆదుకుంటాం

తిమ్మాజిపేట: పత్తి పంట కాలిపోయిన రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మారేపల్లి గ్రామ సమీపంలో రైతు మల్లయ్యకు చెందిన పత్తి కాలిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం మారేపల్లిలో ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను ఎమ్మెల్యే రైతును అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రామకృష్ణయ్యతో ఎమ్మెల్యే మాట్లాడుతూ విచారణ త్వరగా చేసి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు. ఆయన వెంట పార్టీ అధ్యక్షుడు వెంకట్రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌బహదూర్, కొండ నాగేష్, ముబారక్, దేవస్వామి, నాగసాయిలు, తిరుపతిరెడ్డి, సహదేవ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఆవరణలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

తిమ్మాజిపేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. నాగర్‌కర్నూల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మండలంలోని ఆవంచ, చేగుంట, గుమ్మకొండ, కోడుపర్తి, మారేపల్లి, తిమ్మాజిపేట గ్రామాలకు సంబంధించిన 11 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ రామకృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

లింగాల: ప్రభుత్వం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పాండునాయక్ యువతీ, యువకులను కోరారు. మండలంలోని ఆయా గ్రామాలలో బీఎల్‌ఓలు పోలింగ్ బూతుల వారిగా ఓటరు నమోదును చేపట్టారు. శనివారం మండల కేంద్రంతోపాటు, సూరాపూర్ ఓటరు నమోదు బూతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఆర్ఐలు అనిల్, తిర్పతమ్మ, హెచ్ఎం కొండయ్య, వెంకటేశ్వరశర్మ, అంగన్‌వాడీ టీచర్లు గీత, పద్మ, వనజ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మల్లేష్ అన్నారు. మండలంలోని వెనచర్లలో కొత్త ఓటర్ల నమోదు కోసం గ్రామపంచాయతీ వద్ద ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డు, బోనంఫైడ్, పాస్ ఫొటో, జిరాక్స్ కాపీలను అందజేయాలని కోరారు.


లింగాలలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పాండు

కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, గ్రామస్తులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, తీగలపల్లి గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఆర్ఐ సురేందర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు 5 శాతం వాటా కేటాయించాలి

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో వికలాంగులకు 5 శాతం వాటా చెందేలా చట్టం తేవాలని వికలాంగుల రాష్ట ఉపాధ్యక్షుడు కొడవత్ రవి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. శనివారం నియోజకవర్గ స్థాయి వికలాంగుల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2016 వికలాంగుల చట్టం కఠినంగా అమలు చేయాలని, వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలన్నారు. వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, శారీరక వికలాంగులు 56 రోస్టర్ తీసేసి 10లోపు రోస్టర్‌కు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, శంకర్, ప్రధాన కార్యదర్శి బాల్‌నర్సయ్య, జిల్లా కోశాధికారి గట్టు రఘునందన్‌రెడ్డి, రామస్వామి, మల్లేష్, శంకర్, గణేష్, అంజనేయులు, మున్నీరు, పద్మ, విజయ్, శేఖర్, రాఘవ, మురళి, మహేష్, శేఖర్, లక్ష్మయ్య, విజయ్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం విరాళం

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానికి పట్టణానికి చెందిన శివ సునీత, రామకృష్ణలు ఐదు క్వింటాళ్ల బియ్యం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గౌరిశంకర్, పవన్, తిరుపతయ్య, సతీష్‌లు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి

కోడేరు: మండలంలోని బావాయిపల్లిలో సర్వే నంబర్ 59, 60లో భూమి కోల్పోయిన రైతుల పొలాల్లో శనివారం అధికారులు మామిడి తోటలు తొలగిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా సర్వే నంబర్ 59, 60, 61లో కాశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డిలకు సంబంధించి 2020లో 7 ఎకరాల 2 గుంటల భూమి కోల్పోయారని తెలిపారు. అధికారులు అప్పట్లో ఎకరాకు రూ.5.50 లక్షలు కట్టించారని మామిడి తోటలకు మాత్రం డబ్బులు చెల్లించలేదన్నారు. సమాచారం లేకుండా అధికారులు మామిడి తోటలను ఎలా తొలగిస్తారని బాధిత రైతులు ప్రశ్నించారు. నష్ట పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని వారు కోరారు.

ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం



దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని కేంద్రం సేఫ్టీ విభాగం డీఈ శ్రీకుమార్‌గౌడ్, ఏడీఈ రాము పేర్కొన్నారు. భూగర్భజల విద్యుత్ కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమం శనివారంతో ముగిసింది. సివిల్, ఓఅండ్ఎం స్టాఫ్, ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది హాజరయ్యారు. పలు సమస్యలను డీఈ, ఏడీఈల దృష్టికి తీసుకెళ్లారు.

అంత్యక్రియలకు రాకుండా అడ్డగింత

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన దొబ్బల శ్రీశైలం(35) యువకుడు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఐదేళ్ల కిందట భార్యభర్తల గొడవకారణంగా మృతుడి భార్య అనిత పుట్టినిల్లు రాంపూర్‌కు వెళ్లింది. భర్త అంత్యక్రియలకు భార్య అనిత, కుమారుడు హాజరయ్యేందుకు రావడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆమెను అడ్డుకొని గ్రామం నుంచి పంపించారు. దీంతో భార్య అనిత పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. ఈ విషయంపై బంధువులకు నచ్చజెప్పడానికి పోలీసులు వెళ్లిన ఒప్పుకోకపోవడంతో వెనుదిరిగారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: సొంత పనుల నిమిత్తం కల్వకుర్తికి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటనలో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చారకొండ మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన రంగయ్య కల్వకుర్తి కోర్టులో పని ఉందని ఇంట్లో చెప్పి బుధవారం బయలుదేరాడు. కోర్టు సమయం ముగిసినా ఇంటికి రాకపోవటంతో చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలువకపోవడంతో అతని కుమారుడు పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రోటోకాల్‌పై మార్కెట్‌యార్డులో రగడ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మార్కెట్‌యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ రగడతో రచ్చరచ్చగా మారింది. శనివారం వరి కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ సత్యం వారితో ఈ ప్రాంత ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ అధికారులు, మెప్మా అధికారులు లేకుండా ఎలా ప్రారంభిస్తారని మండిపడ్డారు. ప్రోటోకాల్‌కు అర్హులు కాని వ్యక్తులను కొనుగోలు కేంద్రం ప్రారంభానికి ఎలా పిలుస్తారని ఆయన మెప్మా సంఘాల సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మున్సిపల్ తీర్మానం లేకుండా ఎలా ప్రారంభించారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. దాదాపు గంటకు పైగా కాంగ్రెస్ నాయకులతో, మెప్మా కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో ఆయన వాగ్వాదం చేశారు. ఇలాంటి తప్పిదాలను చేస్తూ ప్రోటోకాల్ పాటించకుండా ఉంటే చివరలో బిల్లులు రాకపోతే ఎవరిని అడుగుతారని ప్రశ్నించారు. చివరకు ప్రోటోకాల్ లేని కాంగ్రెస్ నాయకులే వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం విశేషం. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ మహామూద్ షేక్‌ను వివరణ కోసం ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

బహుమతుల ప్రదానం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో ఉన్న కృష్ణానది బ్యాక్ వాటర్‌లో కొన్ని రోజుల నుంచి టూరిజం శాఖ ఆధ్వర్యంలో సోమశిల నుంచి శ్రీశైలం వరకు ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం క్రూయిజ్ లాంచీని ఏర్పాటు చేశారు. శ్రీశైలం వరకు ప్రయాణం చేసే టూరిస్టుల ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ఆన్‌లైన్ గేమ్ నిర్వహిస్తారు. ఇటీవల పోటీలు ఏర్పాటు చేయగా వరంగల్ జిల్లాకు చెందిన మహిళ ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ్మ సోమశిలలో బహుమతిని అందజేశారు.

క్లుప్తంగా

విద్యార్థిని ప్రతిభ

కొల్లాపూర్: బాలల దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో శ్రీ డాన్స్ అకాడమీ, నట్వర్ నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పట్టణానికి చెందిన ఒకటో తరగతి విద్యార్థిని బి.మధురమీనాక్షి ప్రతిభను చాటుకుంది. విద్యార్థినికి కూచిపూడి పురస్కారం అందజేశారు. సినీ నటులు కాదంబరి కిరణ్‌తో పాటు పలువురు విద్యార్థినిని సత్కరించారు.

ఆలయాల్లో పూజలు

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక మాసం సందర్భంగా మహిళలు, అయ్యప్పస్వాములు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు భక్తిగీతాలను ఆలపించారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన నాగయ్య మృతి చెందడంతో శనివారం కాంగ్రెస్‌పార్టీ నాయకుడు అనిల్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

లింగాల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని శనివారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం వండే గదిని, వంటలు, సరుకులను నిల్వ ఉంచే గది, పరిసరాలను పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఎంఈఓ వెంట ఎస్ఓ శారద ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టవిరుద్ధం

అమ్రాబాద్: బాల్యవివాహాలు చేయడం చట్టవిరుద్ధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని లక్ష్మాపూర్(బీకే)లో బాల్యవివాహాల నిర్మూలన, లింగవివక్షతపై చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్‌లైన్ మౌనిక, రేణుకలు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో అవసరమని ఆడపిల్లలను ఉన్నత చదువులను చదివించాలని కోరారు.

మేడిపూర్‌లో కంటి వైద్య శిబిరం

తాడూరు: మండల కేంద్రంలోని మేడిపూర్‌లో శనివారం ఎల్‌వీ ప్రసాద్ కల్వకుర్తి వారి సహకారంతో ఉమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. 15 మందికి కంటి సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఐదుగురిని ఆపరేషన్ నిమిత్తం తూడుకుర్తికి పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డా శ్రీదేవి, ఉమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు శివ శంకర్, కురుమయ్య పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు అధ్వర్యంలో శనివారం హైదరాబాద్ కేర్ ఆస్పత్రి వైద్య బృదం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 1500 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ముగిసిన రాంపూర్ కెనాల్ సర్వే పనులు

లింగాల: మండలంలోని బాకారం, రాంపూర్, వల్లభాపూర్, మానాజీపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న రాంపూర్ కెనాల్ నిర్మాణం పనుల సర్వే శనివారంతో ముగిసింది. నాలుగు రోజులుగా ప్రత్యేక సర్వే బృందాలు ఆయా గ్రామాలను కలుపుతూ ఐదున్నర కిలోమీటర్ల పొడవుతో ఏర్పాటు చేసే కాల్వకు అవసరమైన భూమిని సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో లింగాల, ఉప్పునుంతల సర్వేయర్లు రాంబాబు, షఫిల్లా ఉద్దీన్, ఇంటిలిజెన్సీ ఎస్ఐ మహేష్, ఏఈఈ ధీరజ్, మాజీ ఉప సర్పంచు ధర్మారెడ్డి, రవి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి



సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండలాల్లో శనివారం పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలను నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. నాగర్‌కర్నూల్‌లో రోగులకు అన్నదానం చేశారు. తెలకపల్లి, కోడేరు భక్తి గీతాలను ఆలపించారు. మన్ననూరులో అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కల్వకుర్తి టౌన్: నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని మార్కెట్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ సత్యం ఉన్నారు.